అహింసా ప్రయోగం

పుణ్యప్రదేశ్‌లో డాక్టర్ జీవకారుణ్యం ఎం.ఏ.డి., ఎఫ్.ఆర్.ఏ. (యూ.డీ.) గారి నెరగనివారులేరు. "సాధుప్రకృతి" ఆయన రచించిన ప్రసిద్ధ గ్రంథం. అందులో ఆయన చాలా శాస్త్రీయంగా నిరూపించిన దేమంటే; గ్రహాలు సూర్యుడిచుట్టూ తిరగటంలో గాని, రేడియోతరంగాలు గాలిపొరనుదాటి చంద్రమండలాన్ని తాకటంలోగాని ఎటువంటి హింసా ప్రక్రియగాని లేదు; సముద్రంలో అలలు అహింసాయుతంగా లేస్తాయి; అగ్ని పర్వతాలు నిప్పులుకక్కటం, పిడుగుపడటం, తుపానులు రావటం, భూకంపాలు కలగటం మొదలైన వాటికన్న భయోత్పాదనకరమైన ప్రకృతి స్వభావం మనం కనలేం; మానవుడు అనేక శక్తులను హస్తగతం చేసుకున్నాడు – ఆవిరిశక్తి, విద్యుచ్ఛక్తి, ఇప్పుడు పరమాణు శక్తి! అణువు బాంబు పేలటంలో కూడా హింస ఏమాత్రమూలేదు. అయితే వీటివెంట మనం కాకతాళీయంగా హింసను చూస్తున్నాం. మతి స్థిమితం చెడిపోయి తనను శత్రువులు తరుముతున్నారని భ్రమిసినవాడు ఆరో అంతస్తు కిటికీలోనుంచి కిందపడి చచ్చిపోతున్నాడు. తప్పు భూమ్యాకర్షణదికాదు. అట్లాగే హిరోషిమామీద అణువుబాంబు పేలినప్పుడు ఆ నగరంలో ఎవరూ లేకుండా ఉంటే హింసే జరిగేదికాదు. హైడ్రోజన్ బాంబు వెయ్యటాన్ని హింస అని సిద్ధాంత రీత్యా ఎవరమూ అనలేము. అది వేరేచోటికి వందమైళ్ళదూరంలో ఉండేవాడు హింసాచరణకు కారకుడౌతాడు – అంతే!

"సాధు ప్రకృతి"లో ఉండే అమూల్య విషయాలన్నిటినీ ఇక్కడ చెప్పటం సాధ్యం కాదు; అది 1116 పేజీల గ్రంథం, ఖద్దరు బైండు. దాన్ని అమెరికాలో జనరల్ నట్స్ దగ్గిరనుంచీ, ఆఫ్రికాలో జనరల్ స్మట్స్ దాకా ఎంతోమంది కీర్తించారు. ఈ గ్రంథం రాసినందుకు ప్రభుత్వం డాక్టరుగారికి అవక్రచక్ర బిరుదం మొదటి తరగతి ఇవ్వడమేగాక "సాధు ప్రకృతి" తాలూకు ఒక లక్ష కాపీలు అచ్చువేయించింది. అన్ని పేవ్‌మెంట్లమీద పేపర్ వెయిట్ ధరకు దొరుకుతుంది.

కాని "జంతుబలి" అన్న అధ్యాయం గురించి కనీసం రెండు ముక్కలు చెప్పడం కథకుడి విధి. అధ్యాయం పేరు "జంతుబలి" అని ఉన్నప్పటికీ అందులో చెప్పిన విషయాలు కేవలం రోగక్రిములకు సంబంధించినవి. రోగకారకాలైన క్రిములను కనిపెట్టడమూ, వాటిని

గురించి పరిశోధనలు చెయ్యటమూ, క్రిమి విధ్వంస ఔషధాలు, ప్రత్యేకించి ఆంటీ బయోటిక్ ఔషధాలూ, అవి చేస్తున్న పనీ మొదలైన అంశాలమీద సంగ్రహంగా 183 పేజీలలో చెప్పబడి ఉంది. అణువుబాంబుకన్న మైక్రోస్కోప్ ఎక్కువ గొప్ప మారణాస్త్రమని డాక్టరు గారు యుక్తియుక్తంగా రుజువుచేశారు. ఈ "క్రిములను గురించి పరిశోధించుటలో బహుళముగ జీవహింస జరిగెను. ప్రయోగముల ఫలితముగ అనేకమంది చచ్చెను. ఇట్టి హింసాయుత ప్రయోగముల మూలమున కనిపెట్టిన చికిత్సలు హింసగాక మరి యేమనిపించుకొనునో నాకు తెలియకున్నయది." (తెలుగు తర్జుమా పుట 822 చూడండి.)

"భఘవంతుని దృష్టియందు పిపీలికాది బ్రహ్మపర్యంతము ప్రాణులన్నియు నొక్కటియ, క్షయక్రిములను, సన్నిపాత క్రిములను చంప మానవునకు నధికార మెవరిచ్చిరి? అది యెప్పుడువచ్చెను?" అని ఈయన ప్రశ్నించాడు. "కమ్యూనిస్టులతో సహజీవనము అదెంత దుస్సాధ్యమైనను యత్నింపవలెనని మన మహానాయకులు వేనోళ్ళ వక్కాణించెను. అది సరియ. కాని ఈ సూక్ష్మ క్రిములతో సహజీవనము సాధ్యముకాదా? శరీరములయందు క్షయక్రిములుగల వారందరు క్షయవ్యాధితో తీసికొనుచున్నారా? లేదే? వానిని మారణము చేయు ప్రయత్నమేల చేయవలెను?"

హనుమంతుడు, మార్కండేయుడు మొదలైన చిరంజీవులు పెనిసిలిన్ ఇంజెక్షనులు ఎన్నడైనా పుచ్చుకున్నారాయ అని ఈయన అడిగాడు. పుచ్చుకోలేదని తానే సమాధానం చెప్పాడు. మద్యపానం, పొగతాగుడు, కాఫీ మొదలైన దురభ్యాసాలద్వారా పిల్లలూ, పెద్దలూ, స్త్రీలూ, పురుషులూ "రోగక్రిములు నొసంగువానిని" శత్రువులుగా చేసుకుని, వాటితో సహజీవనం చేసే శక్తిని కోల్పోతున్నారని ఈయన వక్కాణించాడు. ఇక్కడ ఒక చిన్న ఫుట్‌నోట్ ఇచ్చి, సూక్ష్మ క్రిములు పుణ్యప్రాణులనీ, అవి భగవంతుడికి సన్నిహితంగా వున్నాయనీ, మనిషి కష్టపడి నేర్చుకోలేని సద్వర్తన వాటిల్లో సహజంగా ఉన్నదనీ వ్యాఖ్యానించాడు. మనుషులు ఆనందంతో సేవించే సారా, పుగాకు, కాఫీ మొదలైన నిషాలు ఈ క్రిములకు పడకపోవటం ఆశ్చర్యకరమన్నాడు.

డాక్టర్ జీవకారుణ్యం అచ్చగా శాస్త్రవిజ్ఞానికుడేగాక, తన సిద్ధాంతాలమేరకు గొప్ప సంఘశాస్త్రవేత్త. రాజకీయవేత్తకూడానూ. తన ఉద్గ్రంథానికి అనుబంధంగా ఆయన ఎన్నో చిల్లరవ్యాసాలురాసి ఎన్నో మల్లర పత్రికల్లో వేశాడు. వీటిని మేధావులంతా పరిశీలించారు. కొందరు దుర్మార్గులైన రచయితలు డాక్టర్ జీవకారుణ్యంగార్ని ఏకేస్తూ పత్రికల్లో – దుర్మార్గమైన పత్రికల్లో – రాయటం జరగకపోలేదు. కాని దేశంలో హింసావాదులున్నమాట తెలియనిది కాదు. "నేపామ్ బాంబుల్లో హింసవుందా?" అన్న తన వ్యాసాన్ని హింసావాదులు చించి చెండాడారు! "అణ్వస్త్రాలే ఎక్కువ అహింసాయుతమైనవి' అన్న వ్యాసాన్ని

బండబూతులు తిట్టారు! తనను "యుద్ధోన్మాది" అన్నారు. సాంఘిక హింస యావత్తూ పేదవాళ్ళ మూలంగా కలుగుతున్నదని నిరూపించినప్పుడు తనను వాళ్ళు, "కోటీశ్వరులతొత్తు" అన్నారు; వాళ్ళ భాషలోనే ఎంత హింస అయినా ఉంది – ఈ విషయాలు డాక్టర్‌గారికి తెలియనివికావు.

కాని ప్రజాసామాన్యం తన వెంట ఉన్నారనే విషయం జీవకారుణ్యం గారు కలలో కూడా సంశయించలేదు. తన గ్రంథాన్ని సమీక్షిస్తూ ఒక విమర్శకుడు, "తలకిందదిండుకు నోచుకోనివారంతా తప్పక దగ్గిర ఉంచవలసిన గ్రంథం" అన్నప్పుడు డాక్టరుగారు చాలా సంతోషించాడు. నిజంగా తన గ్రంథం పామరులకోసమే రాశాడు – ప్రొఫెసర్ ఐన్‌స్టయిన్‌లాంటి వాళ్ళు చదవటానికి ఎంతమాత్రం కాదు.

కాని "ప్రేమమైదాన్"లో తను మీటింగు పెట్టి మాటలాడినప్పుడు డాక్టరుగారికి పెద్దగా కనువిప్పయింది. ఆ మీటింగుకి అత్యధిక సంఖ్యలో వచ్చినవారు, విద్యార్థులూ, కార్మికులూనూ. వాళ్ళు తను చెప్పేది మొదటినుంచీకూడా సరిగా వినలేదు. వారి హృదయాలలో ఉండే వైషమ్యం కొద్దిసేపటికల్లా ఆయన అవగాహన చేసుకున్నాడు. ఇద్దరు ముగ్గురుకంటె చావలేదు. ఓ వందమందికి గాయాలు తగిలాయి. పోలీసులను పిలుస్తామంటే డాక్టరుగారు వద్దన్నాడు. దీనికి కూడా తప్పుడు వ్యాఖ్యానం చేసినవాళ్ళున్నారు. అదెలా జరిగిందంటే తరువాత అంచనావేయగా, దెబ్బలు తిన్నవాళ్ళలోనూ, చచ్చిన వాళ్ళలోనూ "మెజారిటీ" హింసావాదులదే: ఎవడో హాస్యగాడన్నటు దొమ్మీలో "గెలుపు"... అందుకే తాను పోలీసులను పిలవవద్దన్నట్టు వ్యాఖ్యానించాడు.

సరిగా ఇటువంటి అనుభవమే డాక్టరుగారికి యుద్ధమప్పుడు జరిగింది. ఎవరో కొందరు ఆయన వద్దకు వచ్చి ఒక అప్పీలు మీద సంతకం పెట్టమన్నారు. కొరియా యుద్ధం నిలుపుచేయాలన్న అప్పీలది. "ఆ యుద్ధం ఎవరు ప్రారంభించారో నాకు తెలీదు. యుద్ధంలో ఎవరికి ఎక్కువ హింస జరుగుతున్నదో నాకు తెలీదు. ఎట్లా సంతకం పెట్టను!" అని అడిగాడు. "తామే ఎక్కువ హింస చేస్తున్నట్టు అమెరికావాళ్ళే చెబుతున్నారుగదా?" అన్నారు వాళ్ళు. "వాళ్ళు ప్రగల్భాలు చెప్పుకుంటారు. యుద్ధంలో ఎవరూ తమ నిహతుల సంఖ్య బయటపెట్టరు" అన్నాడు అతను. "యుద్ధోన్మాదుల భృత్యుడు!" అని తనపై వ్యాఖ్యానించారు.

మీటింగు అవసరం పత్రికావిలేఖరులతో మాటలాడుతూ డాక్టరుగారు, "మీటింగు భగ్నమయినందుకు నాకు విచారం లేదు. భావిపౌరులైన విద్యార్థులూ, దేశానికి వెన్నుపూసలాటి కార్మికులూ ఈ పుణ్యప్రదేశ్‌లో ఇంకా హింసామార్గం అవలంబిస్తున్నారంటే నా కెంతబాధగా ఉందో చెప్పకుండా ఉన్నాను. ఒక విద్యార్థి – నాలో మూడవవంతు

వయసుకూడా లేదు - లేచి నిలబడి, “బుద్ధుడేమన్నాడు?” అని అడిగాడు!.... వీళ్ళను నేను తప్పుపట్టను. వీళ్ళు మరొకరి చేతిలో కీలుబొమ్మలు. వాళ్ళు అసలైన రాక్షసులు. వాళ్ళు భగవంతుడితోబాటు ఆస్తిహక్కులకు కూడా ఉద్వాసన చెప్పయత్నిస్తున్నారు. జమీందార్లమీద రైతులను ఉసికొల్పి కాల్పులకు దారితీసి రక్తపాతం కలిగించారు. మిల్లులో కార్మికులచేత సమ్మెలు చేయించి పోలీసుకాల్పులద్వారా రక్తపాతం కలిగించారు” అన్నాడు.

“పెట్టుబడిదారీ, భూస్వామ్య విధానాలు హింసాయుతమైనవన్న విషయంలో మీ అభ్యంతరం ఏమిటి?” అని ఒక విలేఖరి అడిగాడు.

“శుద్ధ అబద్ధం!” అన్నాడు జీవకారుణ్యంగారు.

“కార్మికులు, రైతుకూలీలు తిండికి మాడుతున్న మాట అబద్ధమా?”

“మీరు పొరబడుతున్నారు. కడుపునిండా తినకపోతే కోటీశ్వరుడైనా మాడతాడు. అది ప్రకృతి నియమం. నా ‘సాధు ప్రకృతి’ చదవండి. ప్రకృతిలో హింస ఏమీలేదు” అన్నాడు డాక్టరుగారు.

“దేశంలో హింస జాస్తి అవుతున్నదన్నారుగదా. అది అరికట్టి, ప్రజలు హింసావాదుల కీలుబొమ్మలు కావటానికి బదులు అహింసావాదుల చేతుల్లో, క్షమించాలి! కీలుబొమ్మలుగా ఉండేలాగు చెయ్యటానికి ఏమైనా ఆలోచిస్తున్నారా?” అని ఇంకో విలేఖరి అడిగాడు.

“ఏదో ఒకటి చెయ్యవలసిన అవసరాన్ని నేను గుర్తించకపోలేదు. త్వరలో సాధారణ ఎన్నికలు వస్తున్నాయి. అందుచేత కొన్ని ప్రయోగాలు చెయ్యబోతున్నాను. వాటి ఫలితాలను మీరంతా కళ్ళచూద్దురుగాని. దేశం యొక్క భవిష్యత్తు, అహింస యొక్క భవిష్యత్తు ఈ ప్రయోగాలపై ఆధారపడి ఉందని నేనంటే మీరు దాన్ని ఎంతమాత్రమూ అతిశయోక్తిగా భావించవద్దు.”

అంతే– ఆ తరవాత నాలుగురోజులకే పేలుడు జరిగింది. శాస్త్ర పరిశోధనా చరిత్రలో అటువంటి పేలుడు దాదాపు అపూర్వమనే చెప్పాలి. ఆ పేలుడుకు అనేకవందల మంది చచ్చారు; అనేకవేలమంది గాయపడ్డారు. హింసా పత్రికల్లో చచ్చినవారి ఫొటోలు కూడా వేసి ప్రచారానికి వినియోగించుకున్నారు. పేలుడు గురించి బహిరంగ విచారణ చెయ్యాలని పార్లమెంటులో ప్రశ్నలు వేశారు. “ఇంకా వేడి జాస్తిగా ఉంది. కొంచెం అది తగ్గాక తప్పక అట్లాగే విచారణ చెయ్యవచ్చు” అని మంత్రిగారు సమాధానం చెప్పారు.

విలేఖరులు డాక్టరుగారిని చూడబోయారు. ఆయన తలకూ, చేతికీ కట్లున్నాయి.

“నేను చేసింది చాలా నిరపాయమైన ప్రయోగం. ఒక అరతులం భాషారాష్ట్ర సమస్యా, అర్ధశేరూ సత్యమూ, అర్ధశేరు అహింసా వెచ్చబెట్టి కలపటానికి యత్నించాను.

మొత్తం పేలింది!... సత్యంలో పరమాణువు కన్న ఎక్కువ శక్తి ఉందని నాకు తెలుసు. కాని చెయిన్ రియాక్షన్ రాకుండా రిటార్ట్ చెయ్యటానికి అహింస వేశాను. అయినా పేలింది. జనం చచ్చినందుకు నాకు విచారం లేదు. పేలుడు జరిగినప్పుడు సమీపంలో ఉండేవాళ్ళు ఒక్కొక్కప్పుడు చస్తారు. నేను ఎంతో దూరాన ఉండి కూడా గాయపడ్డాను. కాని వచ్చే ఎన్నికల మాటేమిటని?" అంటూ డాక్టర్ జీవకారుణ్యం ఎం.ఏ.డి., ఎఫ్.ఆర్.ఏ.(యూ.డీ.) గారు పెద్ద నిట్టూర్పు విడిచారు.

ముద్రణ: దుక్కిటెద్దు, కథల సంపుటి, 1955 - 59 మధ్య?
జయా పబ్లికేషన్స్, విజయవాడ